క్లుప్తంగా

రక్షణ చర్యలు చేపట్టాలి

రాజోళి: ఉపాధి హామీ కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు విజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని చేసే చోట ప్రథమ చికిత్స కిట్లు, నీటి వసతి, టెంట్లు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

ఆత్మకూర్: వేసవి సందర్భంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని జూరాల గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని డీపీఓ పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని, పన్నుల వసూళ్లను పూర్తి చేయాలని, తాగునీటి ఇబ్బందులు, పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

కూలీలను తరలిస్తున్న వాహనం పట్టివేత



ధరూరు: మండల పరిధిలోని పారుచర్ల స్టేజీ వద్ద గద్వాల వైపు కూలీలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని బుధవారం రేవులపల్లి పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో 50 మందికి పైగా కూలీలు ఉన్నట్లు గుర్తించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తీసుకుంటామని, గూడ్స్ వాహనాల్లో ప్రజలను తరలించకూడదని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం



గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద మాట్లాడుతూ.. మహిళల హక్కులు, రక్షణ కోసం ఉద్యమించాలన్నారు. సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాణి, పద్మ, సునీత, కాంతమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్ష పత్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఓఎంఆర్ షీట్ ఆధారంగా విద్యార్థులు పరీక్షలు తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు. సీ గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌పై అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రానికి చెందిన శేఖర్ బీసన్నతో కలిసి బైక్‌పై ఎర్రవల్లి కూడలి నుంచి జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో బీచుపల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పదో బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఎదురుగా వచ్చి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. శేఖర్ తలకు తీవ్రగాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వనమహోత్సవానికి సన్నద్ధం

- గ్రామాల్లో సిద్ధమవుతున్న నర్సరీలు
- మండలానికి 96,000 మొక్కలు
- అటవీశాఖ ఆధ్వర్యంలో శిక్షణ



మానవపాడు నర్సరీలో పెంచుతున్న మొక్కలు

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికార యంత్రాంగం దృష్టి సారించింది. మండల పరిధిలోని ఆయా గ్రామాల వారీగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2024– 25 సంవత్సరానికి గానూ మండల వ్యాప్తంగా 16 గ్రామాల పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామానికి 6,000 చొప్పున 16 గ్రామ పంచాయతీల్లో దాదాపు 96,000వేల మొక్కలు పెంచటానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మట్టి, ఎరువుల సేకరణ, బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తవుతున్నాయి. విత్తనాలు, స్టంపులు తెప్పించే ఏర్పాట్లలో అధికారులు ఉన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకానికి చేపట్టే పనులను ఉపాధి హామీ కూలీలను వినియోగిస్తున్నారు. దీని ద్వారా కూలీలకు పని లభిస్తోంది. బ్యాగుల్లో మట్టి నింపి మొక్కలు బ్యాగుల్లో నాటేవరకు పనులు కూలీలే చేస్తున్నారు.

ప్రజలకు అవసరమైన మొక్కలు

గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మొక్కలు పెంచేందుకు అధికారులు దృష్టి పెడుతున్నారు. దీంతో హరితహారం కింద గ్రామాల్లో అందించే మొక్కలు డిమాండ్ ఏర్పడింది. దానిమ్మ, నిమ్మ, నేరేడు, పండ్ల మొక్కలతోపాటు పూలమొక్కలు పెంచేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

కార్యదర్శులకు అటవీశాఖ శిక్షణ...

గతంలో గ్రామ పంచాయతీలకు అటవీశాఖ అధికారులు వారి నర్సరీల్లో పెంచే మొక్కలనే సరఫరా చేసేవారు. అయితే గత నాలుగేళ్లుగా నుంచి ప్రభుత్వం పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటు చేశారు. అయితే నర్సరీల పెంపకం చేపట్టినా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో అటవీశాఖ నర్సరీలకు కార్యదర్శులను తరలించి అక్కడ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

తుది దశకు పనులు

నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం ఇప్పటికే బ్యాగుల్లో మట్టిని నింపే పనులు పూర్తి కావస్తున్నాయి. మొక్కల పెంపకం కోసం నాణ్యమైన మొరాన్ని జాలీ పట్టించి తగినంత సేంద్రియ ఎరువును కలిపి బ్యాగుల్లో నింపే విధంగా పనులు చేట్టారు. బ్యాగుల్లో విత్తనాలు నాటుతూ గ్రామంలో నర్సరీల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

నీరుగారిన హరితహార లక్ష్యం..

గ్రామాల్లో గతంలో చేపట్టిన హరితహార కార్యక్రమం నీరుగారుతోందని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా మాత్రమే మొక్కలను నాటారు. కొందరు విద్యుత్ తీగలు తొలగిస్తూ.. మరికొందరు వ్యవసాయ పంట పొలాలు దెబ్బతింటాయని తొలగిస్తున్నారు. గ్రామాల్లో మొక్కల పెంపకంలో సైతం మూసధోరణి పాటిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆయా పర్యవేక్షించి గ్రామాల్లో వనమహోత్సవ లక్ష్యం సాధించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తూతూమంత్రంగా..



గ్రామాల్లో నర్సరీ పెంపకం తూతూ మంత్రంగా సాగుతుంది. ఆహ్లాదకరమైన మొక్కలు, పండ్ల మొక్కల, పూల మొక్కలకు అధికారులు చర్యలు చేపటడం లేదు. హరితహారం కార్యక్రమం వచ్చిందా.. మొక్కలు నాటామా అనే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు.

-రవి, గ్రామస్తుడు మానవపాడు

ప్రణాళికలు రూపొందించాం

మండలంలోని ప్రతి గ్రామంలో నర్సరీల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిచాం. ఒక్కో గ్రామంలో 6వేలు మొక్కలు, మండల వ్యాప్తంగా మొత్తం 96వేల మొక్కల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. నర్సరీల్లో పనులకు ఉపాధి కూలీలను కేటాయించాం.బ్యాగుల్లో మట్టిని నింపే పనులు కూలీల చేత చేయిస్తున్నం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు సహకారంతో పనులు చేపడుతున్నం.

-విజయ్‌శంకర్ ఏపీఓ, మానవపాడు

మట్టి ఆధారంగా పెంపకం



ప్రజల డిమాండ్ మేరకు వారు కోరిన మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇప్పటికే బ్యాగుల్లో మట్టి నింపే పనులు పూర్తయ్యాయి. విత్తనాల సేకరణకు కార్యదర్శులకు సూచించాం . విత్తనాల రాగానే ప్రాసేసింగ్ చేయించి నాటే కార్యక్రమం చేపడతాము.

-భాస్కర్, ఎంపీడీఓ మానవపాడు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మహిళా సంఘ సభ్యులకు చెక్కు అందజేస్తున్న రీజనల్ అధికారి సత్యనారాయణ

మల్దకల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశ పురోగతి సాధ్యమవుతుందని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన భవన ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లించి కొత్త సంఘాలకు రుణాలు అందే విధంగా కృషి చేయాలన్నారు. సకాలంలో చెల్లించిన మహిళా సంఘాలకు ప్రభుత్వం తమ వంతు సహాయసహకారాలు అందిస్తుందన్నారు.బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులో సిబ్బంది కొరతతో పాటు, ఏటీఎం సమస్యను పరిష్కరించాలని రీజినల్ అధికారి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని సత్యనారాయణ అన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన రూ. కోటి 10లక్షల చెక్కును అందజేశారు. అంతకు ముందు ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ గంగాధరం, అయ్యపురెడ్డి, నాగేంద్రబాబు, శివకుమార్, ఆశన్న, అచ్యుత్, పరుశరాముడు, రఘు, అరవిందరావు, దీరేంద్రదాసు, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తగిన జాగ్రత్తలు పాటించాలి



చాగాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఇటిక్యాల: రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి రాధిక అన్నారు. బుధవారం మండల పరిధిలోని చాగాపురం హెల్త్ సబ్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయించుకోవాలన్నారు. ముఖ్యం గర్భిణులు డీహైడ్రేట్ కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అనిరుధ్, సుపర్‌వైజర్ చంద్రనాగమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



గట్టు పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు




ధరూరులో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

ధరూరు/అలంపూర్/గట్టు: ఇంటర్మీడియట్ పరీక్షలు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ శశిధర్‌రెడ్డి, మన్మోహన్ అన్నారు. బుధవారం ధరూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలకు 349 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సత్యానారాయణ, డిపార్ట్‌మెంటల్ అధికారి శేఖర్ తెలిపారు.

◆ అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 444 మంది విద్యార్థులకు గాను 425 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రశాంత్‌గౌడ్, రాజేందర్ గౌడ్ పరిశీలించారు.

◆ గట్టులో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ త్రీమెన్ కమిటీ సభ్యులు దేవేందర్‌రెడ్డి, పద్మావతి తనిఖీ చేశారు. 287 మంది విద్యార్థులకు గాను 280 మంది హాజరైనట్లు అధికారులు కేఎస్‌డీ రాజు, కాశీ విశ్వనాథ్‌లు తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలని భిక్షాటన



భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

పాన్‌గల్: పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి బుధవారం మండల కేంద్రంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు ఇప్పటి నుంచైనా ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని కోరారు. జీపీ సిబ్బంది వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలని, గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, సిబ్బందిని రెగ్యూలరైజ్ చేయాలని, ఏడాదికి 3 జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి రూ.5 లక్షల బీమా, ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అరుణ్‌కుమార్, రవి, వెంకట్, వెంకట్రాములు, గోపాల్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన



గద్వాల: ప్రతిరోజు కనీసం 50మంది కూలీలకు పని కల్పించాలని, అంతకంటే తక్కువ ఉంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు హెచ్చరించారు. బుధవారం గద్వాల మండలం బీరెల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయి పరిశీలించారు. ఆయిల్‌పామ్ తోటలు, రైతులకు సంబంధించిన పేమెంట్లు రెగ్యులర్‌గా చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మానవపాడు: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర సాయిశృతి, రాజు అన్నారు. బుధవారం మండలంలోని పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పలు వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఆర్టీఏ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



శాంతినగర్: రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేపడుతున్న ముస్లింలకు స్థానిక మాజీ కోఆప్షన్ మెంబర్, పెట్రోల్ బంక్ డీలర్ నజీర్ అహ్మద్ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల అనంతరం రజాక్, కలీముల్లా మౌలానా దుఆ చదివారు. సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాంతినగర్: టీడీపీ సీనియర్ నాయకుడు ఉప్పల పూర్ణచంద్రరావు సతీమణి మృతి చెందారు. ఈ సందర్భంగా బుధవారం పలు పార్టీలకు చెందిన నాయకులు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



నూతన ట్రాన్స్‌ఫార్మర్లకు నిర్వహిస్తున్న పూజలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు

ధరూరు: రైతు శేయస్సే ప్రభుత్వ ధేయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులకు మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకున్న పాపానపోలేదని, రైతులు కరెంటు కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు నాణ్యమైన విద్యుత్ అందక అవస్థలు పడ్డారన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకు పెరుగుతున్న లోడ్‌ను తగ్గించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 500 ట్రాన్స్‌ఫార్మర్లు అందించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంజూరు పత్రాలను మండల నాయకుల చేతుల మీదుగా రైతులకు అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బండారి భాస్కర్, గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు పద్మా వెంకటేశ్వరరెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, కురుమన్న, వెంకటేశ్వరరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మహబూబ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ నిధులతో ముఖద్వార నిర్మాణం



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

గట్టు: మండల పరిధిలోని మాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ముఖ ద్వారాన్ని బుధవారం హెచ్ఎం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. పీఎం శ్రీ 2వ విడత ద్వారా మాచర్ల ఉన్నత పాఠశాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. పీఎం శ్రీ నిధుల ద్వారా గేటు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పీఎంశ్రీ పథకం ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, నీటిశుద్ధి కేంద్రాన్ని సరస్వతి కళావేదిక విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు

అలంపూర్: సకాలంలో పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు అన్నారు. 2024–25 వార్షిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను సిబ్బందితో కలిసి బుధవారం పన్ను వసూలు చేశారు. బకాయిలు ఉన్నవారు సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పన్ను చెల్లించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్‌పై 25 డిస్కౌంట్ గురించి టౌన్ ప్లానర్ కురుమయ్య వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి వివరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, శరత్‌బాబు, రహమతుల్లా, రామచంద్రుడు, నర్సింహ పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



రాఘవేంద్ర



మహ్మద్ సుభాన్

మల్దకల్: రైతు కూలీ కుటుంబంలో జన్మించిన ఓ యువకుడు పట్టుదలతో చదివి గెజిటెడ్ లెక్చరర్ ఉద్యోగం సాధించాడు. చదువుకు పేదరికం అడ్డు రాదనే దృఢ సంకల్పంతో ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఎల్కూరు గ్రామానికి చెందిన నడిపి ఖాజా హుసేన్, చాంద్‌బీల కుమారుడు మహ్మద్ సుభాన్ 2014లో పంచాయతీ కార్యదర్శి, 2024లో ప్రభుత్వ గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగం, జూనియర్ లెక్చరర్‌గా, 2023లో టీజీపీఎస్సీ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ రాత పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి బుధవారం ధరూరు ప్రభుత్వ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా నియమితులయ్యాడు. ఈ సందర్భంగా సుభాన్‌ను పలువురు అభినందించారు.

చదువుకున్న కాలేజీలోనే లెక్చరర్‌గా..

గట్టు: పట్టుదలతో చదివి ఏకంగా 4 ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు మండల కేంద్రానికి చెందిన రాఘవేంద్ర. హైదరాబాద్ రవీంద్రభారతీలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జూనియర్ లెక్చరర్‌గా నియామక పత్రాన్ని అందుకున్నారు. ప్రస్తుతం అతను చదువుకున్న మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థిక శాస్త్ర లెక్చరర్‌గా పోస్టింగ్ వచ్చినట్లు రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



జల్లాపురం పాఠశాలలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



ఉదండాపురంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

ఇటిక్యాల/మానవపాడు: మండల కేంద్రంలోని మునుగాల, ఉదండాపూరం పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేశారు. ఉదండాపురం ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ వెంకటేశ్వర్లు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాగుంటన్న, నాగరాజ్, ఉదయ్ కిరణ్, ఉపాధ్యాయులు రవికుమార్ ప్రభాకర్, వెంకటేశ్వర్ రెడ్డి, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

◆ మానవపాడు మండలంలోని జల్లాపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మండల విద్యాధికారి రవీంద్రబాబు పరిశీలించారు. బుధవారం మండల పరిధిలోని నీలహళ్లి, వామన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అదే విధంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వండాలని సూచించారు. అపార్ ఐడీలు నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగించండి



కొత్త రాజోళిలోని పునరావాసంలో పెరిగిన ముళ్ల కంపలు

రాజోళి: కొత్త రాజోళిలోని పునరావాసంలో ఉన్న గృహాల్లో ముళ్లపొదలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల్లో ముళ్ల పొదలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గృహాల్లోకి విషసర్పాలు సంచరిస్తున్నాయని, చీకటి వేళల్లో బయటకు రావాలంటే భయంగా ఉందని వాపోతున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో అనారోగ్య సమస్యల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల - కె.నీలాంజనుడు - 9642913894
అలంపూర్/అయిజ - ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బార్ లాల్ :
9553955603